# చార్లీ చాప్లిన్ సినిమాకళ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

చార్లీ చాప్లిన్ హాస్యగాడుగా ప్రసిద్ధికెక్కాడు. అతని హాస్యం వెనక కరుణకూడాఉందని విమర్శకులు చాలాకాలం క్రితమే గుర్తించారు. లాక్షణికంగా చార్లీ చాప్లిన్ సినిమాకళ కరుణాసమన్వితమైన హాస్యంప్రధానంగా గలది అని చెప్పినంత మాత్రం చేత చాప్లిన్ సినిమాకళను గురించి సమగ్రంగా వివరించి చెప్పినట్టు కాదు.

టెక్నికల్‌గా చాప్లిన్ హాలీవుడ్‌కు కొంతవెనకగా ఉంటూ వచ్చాడు. టాకీలువచ్చిన చాలా కాలం చాప్లిన్ మూకీలే తీస్తూ వచ్చాడు. గతప్రపంచ యుద్ధం ప్రారంభమైన తరువాత విడుదల అయిన "గ్రేట్‌డిక్టేటర్" చిత్రంలో మొట్టమొదటిసారి చాప్లిన్ నోరు తెరచి మాట్లాడాడు. ఈనాడు కూడా చాప్లిన్ చిత్రాలలో శిల్పం పాత వాసనే కొడుతూ ఉంటుంది.

చాప్లిన్ ప్రత్యేకత తెలుసుకోవాలంటే అతని ఆశయాలను, వాటిని చాప్లిన్ సాధించే పద్ధతులనూ అవగాహన చేసుకోవాలి.

"కిడ్" "గోల్డ్‌రష్" "సర్కస్" "సిటీలైట్స్" "మోడరన్‌టైమ్స్" "గ్రేట్‌డిక్టేటర్" "మన్స్యూవెర్డూ—" 1925నుంచీ 1947వరకూ చాప్లిన్ తయారుచేసిన చిత్రాలు ఈ ఏడే. వీటిలో మొదటి ఆరింటిలోనూ చాప్లిన్ ఒకేపాత్రధరించాడనీ, అకస్మాత్తుగా "మన్స్యూవెర్డూ"లో అతను వేషం మార్చేశాడనీ, అందరూ నమ్ముతున్నారు. ఇది కేవలం పొరపాటు. తన పాత్రను "ట్రాంప్" అని పిలవ నిచ్చాడు చాప్లిన్ కాని ఇదికూడా పూర్తిగా నిజం కాదు. ఎందుచేతనంటే దాదాపు ప్రతి చిత్రంలోనూ చాప్లిన్ ధరిం

చిన పాత్ర ఏదో పని చెయ్యటానికి ప్రయత్నిస్తుంది. "కిడ్"లో అద్దాలు వేస్తుంది, ఇళ్ళ ముందు మంచు ఊడుస్తుంది. సర్కస్‌లో కూడా సర్కసు పనులు చెయ్యటానికి సిద్ధపడుతుంది. "మోడరన్ టైమ్సు"లో ఈ పాత్ర ఫ్యాక్టరీ కూలీ. "గ్రేట్ డిక్టేటర్"లో మంగలి. అయితే చార్లీ చాప్లిన్ ఇన్ని ఏళ్ళుగా ధరిస్తూ వచ్చిన పాత్రను శ్రామికుడనటానికి రెండు కారణాల చేత వీలు లేదు. ఒకటి, ఈ పాత్రకు శ్రమించటంలో విశ్వాసం లేదు. రెండు, ఈ పాత్రయొక్క ఆశయాలు మధ్యతరగతి మనస్తత్వానికి చెందినవీ, అసాధ్యమైనవీనూ.

"మన్స్యూ వెర్డు" చిత్రంలో చాప్లిన్ పాత్ర అకస్మాత్తుగా మారాడా? లేదు. ఇప్పుడైనా అతను ఉద్యోగం పోగొట్టుకున్న బాంకు గుమాస్తా— మంగలివానికన్న ఎక్కువ ఘనమైనవాడు కాడు. అయితే ఈ చిత్రంలో కూడా ఈ అభాగ్యుడైన బాంకు గుమాస్తా తన గొంతెమ్మ కోరికలు తీర్చుకోవటంలో వెనకటి పాత్రకన్న ఎక్కువ విజయం పొందినట్టు కనిపిస్తాడు— కాని నిజంగా విజయం పొందడు. "సిటీలైట్స్" అనే చిత్రంలో చాప్లిన్ తన ప్రియురాలి గుడ్డితనం పోగొట్టటానికి దొంగతనం చేసి జైలుకు పోయి, కళ్ళు వచ్చాక ఆమెకూ తనకూ ఉన్న ఎడం తెలుసుకుని తన ప్రేమ గగన కుసుమమని గ్రహించుకున్నట్టుగానే, వెర్డు కూడా తన భార్యాపిల్లలు పోగానే తన ఆదర్శాలు తనకు అందకుండా పోయాయని తెలుసుకుంటాడు.

వెర్డుగా చాప్లిన్ మారలేదు— పరిణామం చెందాడు; అంతే! 1925లో కిటికీలకు అద్దాలు వేసే వాడికి జీవితం మీద ఎంత అధికారం ఉందో, అతడి కలలు నిజమయ్యే అవకాశా లేపాటి ఉన్నాయో, 1947లో వెర్డు వంటి బాంకు గుమాస్తాకు జీవితం మీద అంతే అధికారమూ, తన కలలు నిజం చేసుకోవటానికి అంతే అవకాశాలూ ఉన్నాయి. సాంఘిక పరిణామం ఇది కాదా?

చార్లీ చాప్లిన్ కళ వాస్తవిక కళ కాదు. అతని పాత్రలు యథార్థ పాత్రల ప్రతిబింబాలు కావు. అతను మనకు ఒక అద్దాలమ్మేవాణ్ణిగాని,

ఒక ఫ్యాక్టరీ కూలీని గాని, ఒక మంగలినిగాని, ఒక బ్యాంకుగుమాస్తానుగాని, చూపడు. మధ్యతరగతి వాళ్ళ ఆదర్శాలకూ నగ్నజీవితానికీ ఉండేసంఘర్షణను చిత్రించేటందుకు ఈ యీపాత్రలను చాప్లిన్ సృష్టించాడు. చాప్లిన్ కళ ప్రత్యేకించి మధ్యతరగతికే. మధ్యతరగతి వాళ్లు విశ్వసించే ధర్మాలునియమాలు,డబ్బు,అధికారం పోలీసులు, సంస్కారం నికృష్ట జీవుల జీవితాల దృష్టి పథంనుంచి ఎట్లాకనిపిస్తాయో చాప్లిన్ చూపిస్తాడు. మధ్యతరగతివాళ్ళ కలలు భగ్నం చేస్తాడు. "కిడ్" చిత్రంలో పోలీసు వాడికి దడిచి చాప్లిన్ ఎవరో వొదిలేసిన కుర్రవాణ్ణి పట్టుకుపోయి పెంచుకుంటాడు. "మోడరన్ టైమ్స్" చిత్రంలో ఎవరో పారేసుకున్న ఎర్రజండా చేతితో పట్టుకుని ఎరెస్టవుతాడు. పోలీసులు శాంతి భద్రతలుకాపాడటానికి కావచ్చు, కాని వారు కాపాడే శాంతిగాని భద్రతగాని అనాధలవికావు. తిండి ఆకలి తీర్చడానికి కావచ్చు, కాని బీదవాళ్ల ఆకలి తీర్చడానికికాదు. మతం, ఆత్మశాంతికి కావచ్చు, కాని అసమర్థుడి ఆత్మ శాంతికి మటుకు కాదు. ఒకబుడ్డివేసివున్నప్పుడుతప్ప ధనికుడి మానవ ప్రేమను విశ్వసించటానికిలేదు. డబ్బుతోపోయిన కళ్లు తెప్పించవచ్చు కాని జైలుకు పోకుండా అనాధకి ఆడబ్బు లభించదు. సంఘంలో ఉండే ఈసత్యాలని విమర్శిస్తూ చాప్లిన్ చిత్రాలు తీస్తూ వచ్చాడు. మధ్యతరగతి వాస్తవికతద్వారా ఈ సత్యాన్ని ఎన్నటికీ గ్రహించలేదు.

చాప్లిన్ రసాన్ని సాధించే విధానంకూడా వాస్తవికతకుతావివ్వదు. ఎంత ఆకలిగొన్నవాడుగాని మైనపు వత్తులు తినగలడా? చెప్పులు వండుకుని తినగలడా? ఎక్కడున్నా ప్రెస్సులోపడ్డ జేబుగడియారం వెడల్పయిన అట్ట గడియారంలాగా సాగుతుందా? యంత్రాల్లో ఇరుక్కుపోయిన మనిషి ఒక్క చుక్క రక్తం కారకుండా బతికి బయటికి వస్తాడా? చాప్లిన్ చిత్రాల్లో ఇవన్నీ సాధ్యమవుతాయి. వెర్రిచేసేవ్యాపారం

వయసుమళ్లిన, డబ్బుగల స్త్రీలను పెళ్లాడి హత్యచేసి డబ్బు కాజెయ్యటం. అయినప్పటికీ "వెర్డు" చిత్రంలో భీభత్సం దాదాపు లేనే లేదు.

చాప్లిన్ రాజకీయవాది కాడు. "వెర్డు" చిత్రంచూసి చాప్లిన్ను "నీవు కమ్యూనిస్టువా ?" అనిఅడిగిన వాడి కన్న మతిలేని వాడుండబోడు. డిక్టేటర్లు, నిరుద్యోగమూ, లాకవుట్లూ, వ్యాపారమూ, మారణ సామగ్రి నిర్మాణము, యుద్ధాలూ—వీటినిగురించి విస్పష్టమైన అభిప్రాయాలు వెలిబుచ్చే అధికారం రాజకీయ వాదులకే ఉన్నట్లూ, కళాకారులకి లేనట్లూ మాట్లాడడం మూఢత్వం. సాంఘిక దోపిడి చలాయించేవాళ్లు ఇటువంటి మూఢత్వాన్ని బలపరుస్తారు.

చాప్లిన్ తన చిత్రాలద్వారా సాంఘిక వ్యవస్థను విమర్శించుతాడేగాని ప్రపంచానికి రాజకీయ ప్రణాళిక లివ్వడు. అంతవరకు కళాకారుడుగా అతన్ని తప్పుపట్టడానికి ఎవరికీ అధికారంలేదు.

ఇటీవల మన దేశంలో విడుదల అయిన "మస్స్యూ వెర్డూ" చిత్రంలో చార్లీ చాప్లిన్ కళ అనేకవిధాల ఉన్నతస్థాయికి వచ్చింది. "వెర్డూ" వాస్తవిక పాత్రకాదు. తన భార్యాబిడ్డల మీదిప్రేమ కొద్దీ ధనార్జన కోసం హత్యలు సాగించే యధార్థ పాత్ర. కొద్దికాలానికి హంతకుల మనస్తత్వం అవలంబించి సంఘానికీ మధ్యతరగతి విలువలకూ ఎడమై పోతుంది. కాని "వెర్డూ" అట్లా కాడు. తనస్థితిలో నేడున్న ఒక అనాధ స్త్రీకి సహాయంచేస్తాడు. హింస, హింసను ప్రేరేపిస్తుందంటాడు. నోరులేని జంతువులమీద ప్రేమ చూపిస్తాడు. తన భార్యాబిడ్డలను చివరివరకూ ప్రేమిస్తాడు. ఒక వ్యక్తి చెయ్యలేని ఈ పని మధ్యతరగతి చేస్తూ నేడున్నది. మధ్యతరగతికి జీవకారుణ్యంలో విశ్వాసం ఉన్నది, యుద్ధాలనూ ఆమోదిస్తున్నది. నీతిలోనూ విశ్వాసం ఉంచుతున్నది, వ్యాపారాన్నీ ఆమోదిస్తున్నది. "వెర్డూ" మధ్యతరగతిప్రజ. మధ్యతరగతిగురించ

(మిగతా 31 పేజీలో)